# యుద్ధ, సంక్షోభాల్లో నలుగుతున్న చిన్నారులు !

## (04 జూన్ "దురాక్రమణకు గురైన అమాయక పిల్లల అంతర్జాతీయ దినం" సందర్భంగా)

యుద్ధాలు, సంక్షోభాల విష వలయంలో ప్రపంచ మానవాళి చిక్కుకొని సతమతం అవుతున్నది. యుద్ధాలతో అందమైన సహజ ప్రకృతి క్షణాల్లో శ్మశాన వాటికలుగా మారుతున్నాయి. యుద్ధాలు, సంక్షోభాలతో ప్రపంచ మానవాళి గాయపడడం, ప్రాణాలు కోల్పోవడం, ఆస్తి నష్టాలు, ఆర్థికంగా చితికి పోవడం, పర్యావరణ కాలుష్య కోరల్లో చిక్కుకొని పోవడం, అమాయక పిల్లలు సహితం ప్రాణాలు కోల్పోవడం లేదా గాయపడడం, పాఠశాలలు మూత పడడం, ఆరోగ్య సంరక్షణకు విఘాతం కలగం జరుగుతోంది. 2023లో ప్రపంచ నలుమూలల జరిగిన లాండ్‌మైన్స్, విస్పోట ఆయుధాలు పేలడంతో 11,649 మంది పిల్లలు మాత్రమే చనిపోవడం లేదా అంగవైకల్యాన్ని పొందడం జరిగింది. కాంగో, సొమాలియా, నైజీరియా లాంటి దేశాల్లో 8,655 మంది పిల్లలు సంక్షోభ వ్యవస్థలో వినియోగించబడడం, 4,356 మంది పిల్లలు బలవంతంగా అపహరించబడడం జరిగింది. అఫ్ఘానిస్థాన్, మియన్మార్, సూడాన్ లాంటి దేశాల సంక్షోభాల్లో 1,470 మంది పిల్లలు లౌంగిక వేధింపులకు గురి కావడం, 5,205 మంది మానవీయ సేవలకు దూరం కావడం జరిగింది. 2021 – 23 మధ్య వివిధ సంక్షోభాల్లో 1,650 పాఠశాలలు/ఆరోగ్య కేంద్రాలు ధ్వంసం కావడం జరిగి పిల్లలు చదువులకు దూరం కావడంతో పాటు అనారోగ్యాలను మోయడం జరిగింది.

దురాక్రమణకు గురైన అమాయక పిల్లల అంతర్జాతీయ దినం–2025:

1982లో లెబనాన్ – పాలస్తీనా యుద్ధంలో అమఆయక పిల్లలు ఆహుతి కావడాన్ని తీవ్రంగా భావించిన ఐరాస ప్రతి ఏట 04 జూన్‌న "దురాక్రమణకు గురైన అమాయక పిల్లల అంతర్జాతీయ దినం" లేదా "ఇంటర్నేషనల్ జే ఆఫ్ ఇన్నోసెంట్ చిల్డ్రన్ విక్టిమ్స్ ఆఫ్ అగ్రెషన్" పాటించాలని సభ్య దేశాలకు సూచించడం జరిగింది. యుద్ధాలు, సంక్షోభాలు జరిగినపుడు అమాయక పిల్లలు శారీరక, మానసిక, భావోద్వేగ దురలవాట్ల గుప్పిట్లో చిక్కుతున్నారు. తాజా వివరాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 536 మిలియన్ల పిల్లలు సంక్యోభ ప్రదేశాల్లో దుర్భర జీవితం గడపడం లేదా ప్రాణాలు కోల్పోయే అంచున నిలబడడం జరుగుతున్నది. దాదాపు 50 మిలియన్ల పిల్లలు ఇండ్లను కోల్పోయి శిబిరాల్లో గడుపుతుండడం, 200 మిలియన్ల పిల్లలు లౌంగిక హింకకు లోనవుతున్నారు. పాకిస్థాన్, ఈజిప్ట్, మొజాంబిక్, వియత్నామ్, అర్జెంటీనా, రష్యా, నైజీరియా, ఇండోనేషియా లాంటి దేశాల్లో పిల్లల భవిష్యత్తు అగమ్యగోచర దుస్థితికి చేరింది. దురాక్రమణకు గురైన అమాయక పిల్లల అంతర్జాతీయ దినం–2025 ఇతివృత్తంగా "శారీరక, మానసిక, భావోద్వేగ వేధింపుల బాధిత పిల్లల బాధను అర్థం చేసుకుందాం" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు.

యుద్ధ మంటల్లో అమాయక పిల్లల భవిష్యత్తు బుగ్గల పాలు:

నేడు ఉక్రెయిన్ – రష్యా, ఇజ్రాయిల్ – పాలస్తీనా మధ్య భీకర పోరు జరుగుతోంది. 24 ఫిబ్రవరి 2022న ప్రారంభమైన ఉక్రెయిన్‌పై రష్యా దాడి ఏళ్ల తరబడి కొనసాగుతూ నేటికీ భీకరం స్థాయిలో కొనసాగుతున్నది. ఈ యుద్ధంలో రష్యాలో 2,23,000 మంది గాయపడడంతో పాటు అందులో 43,000 మంది ప్రాణాలు కోల్పోయారు. ఉక్రెయిన్ పక్షాన 1,31,000 గాయపడడంతో పాటు అందులో 17,500 మంది మరణించడం జరిగింది. ఈ యుద్ధంలో 2,520 మంది పిల్లలు గాయపడడంతో పాటు అందులో 669 మంది అమాయక పిల్లలు మరణించారు. దీనికి తోడుగా ఉక్రెయిన్‌లో 1,600 పాఠశాలలు, 786 వైద్య కేంద్రాలు ధ్వంసం అయ్యాయి. దాదాపు 44 శాతం మంది పిల్లలు చదువులకు దూరంగా, ఆకలి చావుల మధ్య తాత్కాలిక శరణార్థి శిబిరాల్లో కాలం గడుపుతున్నారు. గాజాపై ఇజ్రాయిల్ దాడుల్లో దాదాపు 50,000 మంది పిల్లలు గాయపడడం లేదా మరణించడం జరిగింది. నేడు ఉక్రెయిన్, పాలస్తీనాల్లో ప్రజలు, ముఖ్యంగా పిల్లలు చావు నోట్‌లో తలపెట్టి కాలం గడపడం చూస్తున్నాం. యుద్ధాల్లో మానవీయత మంట గలుస్తోంది.

యుద్ధ ప్రదేశాలు, సంక్షోభ ప్రాంతాల్లో మానవ హక్కులు మంటగలవడంతో పాటు పిల్లల నిండు నూరేళ్ల జీవితాలు చిన్నతనంలోనే చితికి పోతున్నాయి. పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు ధ్వంసం కావడంతో పిల్లల చదువులకు విఘాతం కలగడం, ఆరోగ్య కేంద్రాలు కొరవడడంతో రోగాల పాలు కావడం జరుగుతోంది. ఈ ప్రదేశాల పిల్లలను కాపాడడం, విద్య అవకాశాలు కొనసాగించడం, మరణాలకు అడ్డుకట్ట వేయడం, అంగవైకల్యం పొందడాన్ని నిరోధించడం, లౌంగిక హింసకు దూరంగా తగు చర్యలు తీసుకోవడం, అపహరించడాన్ని నిరోధించడం లాంటి చర్యలను తీసుకోవాలి, లేత పిల్లల భవిష్యత్తుకు ఉజ్వల బాటలు వేయాలి.

–డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

## ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



హన్మకొండ, జూన్ 3:(నేటినిజం ప్రతినిధి) హనుమకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రానికి చెందిన బొల్లెపల్లి మంజుల అనే మహిళ లబ్ధిదారుకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా ఇంటి నిర్మాణ పనులను హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. సదరు మహిళా లబ్ధిదారు కుటుంబ సభ్యులు, అధికారులు, స్థానికుల సమక్షంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఇంటి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటి నిర్మాణ పనులను వేగవంతంగా నెల రోజుల్లో పూర్తయ్యే విధంగా చూడాలని లబ్ధిదారు కుటుంబ సభ్యులకు సూచించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సూచించిన విధంగా వివిధ దశలకు ఇంటి నిర్మాణ బిల్లులను చెల్లించడం జరుగుతుందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు సంబంధించి ప్రతి సోమవారం లబ్ధిదారుల ఖాతాలకు సంబంధిత బిల్లు జమ అవుతాయని అన్నారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణ శాఖ డీఈ సిద్ధార్థ నాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఉలాన్‌బాతర్ ఓపెన్ 2025లో అద్భుత ప్రదర్శన కనబరిచిన రెజ్లర్లను అభినందించిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జూన్ 3:ఉలాన్‌బాతర్ ఓపెన్ 2025లో జరిగిన 3వ ర్యాంకింగ్ సిరీస్‌లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచినందుకు రెజ్లర్లను ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అభినందించారు.

"ఇప్పటివరకు చూస్తే మన నారీ శక్తి ర్యాంకింగ్ సిరీస్‌లో అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చింది. ఇది ఈ ఘనతను మరింత గుర్తించుకునేదిగా చేసింది. ఈ క్రీడా ప్రదర్శన అనేక మంది భవిష్యత్ అథ్లెట్లకు స్ఫూర్తినిస్తుంది" అని ప్రధాని అన్నారు.

"క్రీడలలో భారత్ విజయాలు కొనసాగుతున్నాయి! ఉలాన్‌బాతర్ ఓపెన్ 2025 3వ ర్యాంకింగ్ సిరీస్‌లో 6 స్వర్ణాలు సహా 21 పతకాలను గెలుచుకొని అద్భుతమైన ప్రదర్శన కనబరిన మన రెజ్లర్లకు అభినందనలు. మన నారీ శక్తి ర్యాంకింగ్ సిరీస్‌లో ఇప్పటివరకు చూస్తే అత్యుత్తమ ప్రదర్శనను అందించింది.

ఇది ఈ ఘనతను మరింత గుర్తించుకునేదిగా చేసింది. ఈ ప్రదర్శన అనేక మంది రాబోయే అథ్లెట్లకు స్ఫూర్తినిస్తుంది."

## పెద్దవంగరలో వేడుకగా ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీ



మహబూబాబాద్, జూన్ 2: (నేటినిజం ప్రతినిధి): ఇందిరమ్మ పట్టాల పంపిణీలో భావోద్వేగానికి లోనైన ఎమ్మెల్యే యశస్విని రెడ్డిమహబూబాబాద్ పెద్దవంగర మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నిరు పేదలైన లబ్దిదారులకు ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని లబ్దిదారులకు పట్టాలు అందజేసి భావోద్వేగానికి లోనై కన్నీరు పెట్టుకున్నారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ ఇల్లు అనేది ప్రతి పేద కుటుంబానికి ఒక ఆశ్రయం,తలదాచుకునే చోటు కలగడం ద్వారా వారి జీవితంలో స్థిరత్వం కలుగుతుంది. ఇందిరమ్మ పథకం ద్వారా ప్రభుత్వం కల్పిస్తున్న ఇండ్ల స్థలాల పట్టాలు ఎంతో మంది పేదలకు భవిష్యత్తులో ఆర్థిక భద్రత కలిగించనున్నాయి అని తెలిపారు. ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. అవసరమైన వారందరికీ ఈ పథక ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బోడేపూడి వేణుమాధవ్, వివిధ అధికారులు, మండల పార్టీ అధ్యక్షులు ముద్దసాని సురేష్, ఉపాధ్యక్షులు రంగు మురళి, నాయకులు గోపాల్, పొడి శెట్టి సైదులు, బొమ్మెరబోయిన రాజు, బీసు హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## నార్వే చెస్ 2025లో మాగ్నస్ కార్ల్‌సెన్ పై తొలిసారిగా విజయం సాధించిన గుకేశ్‌ను అభినందించిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జూన్ 3:తొలిసారిగా మాగ్నస్ కార్ల్‌సెన్‌పై విజయం సాధించినందుకు చెస్ ఆటగాడు గుకేశ్ కు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. నార్వే చెస్ 2025 రౌండ్ 6లో మాగ్నస్ కార్ల్‌సెన్ పై గుకేశ్ గెలిచాడు."అత్యుత్తమ ఆడగాడిపై విజయం సాధించినందుకు అభినందనలు. నార్వే చెస్ 2025 రౌండ్ 6లో తొలిసారిగా మాగ్నస్ కార్ల్‌సెన్‌పై విజయం సాధించడం అతని ప్రతిభ, అంకితభావాన్ని తెలియజేస్తోంది." అని ప్రధాని అన్నారు.

" గుకేశ్ సాధించినది అసాధారణ విజయం! అత్యుత్తమ ఆటగాడిపై విజయం సాధించినందుకు అతనికి అభినందనలు. నార్వే చెస్ 2025 రౌండ్ 6లో మాగ్నస్ కార్ల్‌సెన్‌పై తొలి విజయం అతని ప్రతిభ, అంకితభావాన్ని తెలియజేస్తోంది. ముందున్న జీవన ప్రయాణంలో అతనికి విజయం కలగాలని కోరుకుంటున్నాను."

# వరల్డ్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ సమిట్ ప్లీనరీలో పాల్గొన్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, జూన్ 3:విమానయాన రంగంలో ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం, కనెక్టివిటీని మెరుగుపరచడం పట్ల తన నిబద్ధతకు అనుగుణంగా, ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈరోజు న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (ఐఏటీఏ) 81వ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎమ్).. వరల్డ్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ సమిట్ (డబ్ల్యుఏటీఎస్) ప్లీనరీ సమావేశంలో ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ, ఈ సమావేశానికి విచ్చేసిన అతిథులను స్వాగతించారు. నాలుగు దశాబ్దాల అనంతరం మళ్లీ ఈ కార్యక్రమాన్ని భారత్‌లో నిర్వహించడంలోని ప్రాముఖ్యతను ఆయన వివరించారు. ఈ కాలంలో భారత్‌లో చోటుచేసుకున్న సానుకూల మార్పులను ప్రధానంగా ప్రస్తావించిన ప్రధానమంత్రి, నేటి భారత్ ఎప్పుడూ లేనంత విశ్వాసంతో ఉందని పేర్కొన్నారు. ప్రపంచ వైమానిక రంగంలో భారత పాత్రను ప్రస్తావిస్తూ, విస్తారమైన మార్కెట్‌గా మాత్రమే కాకుండా విధానపరమైన నాయకత్వం, ఆవిష్కరణలు, సమగ్ర అభివృద్ధికి చిహ్నంగా భారత్ నిలిచిందన్నారు. "నేడు, అంతరిక్ష–విమానయాన రంగాల్లో భారత్ ప్రపంచంలో అగ్రగామిగా ఎదుగుతోంది'' అని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. గత దశాబ్దంలో పౌర విమానయాన రంగం సాధించిన చారిత్రాత్మక పురోగతిని ప్రపంచమంతా చూస్తోందన్నారు.

ఈ సదస్సు, చర్చలు కేవలం విమానయాన రంగానికి మాత్రమే పరిమితం కాకుండా, ఇవి ప్రపంచ సహకారం, వాతావరణ ఒప్పందాలు, సమాన వృద్ధిని ముందుకు తీసుకెళ్లే వేదికగా పనిచేస్తాయని శ్రీ నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ సదస్సులో జరిగే చర్చలు ప్రపంచ విమానయాన రంగానికి సరికొత్త దిశానిర్దేశం చేస్తాయన్నారు. తద్వారా ఈ రంగంలో గల అపారమైన అవకాశాలను అందుబాటులోకి తేవడంతో పాటు, దాని సామర్థ్యాన్ని మెరుగుపరుస్తాయని ఆయన వ్యాఖ్యానించారు. 21వ శతాబ్దపు ఆకాంక్షలు.. సంప్రదాయిక ప్రయాణాలకు మించి అభివృద్ధి చెందుతూనే ఉన్నాయని పేర్కొన్న ప్రధానమంత్రి, విస్తారమైన దూరాలను, ఖండాంతర ప్రయాణాలను కేవలం కొద్ది గంటల్లోనే పూర్తి చేయగల మానవాళి సామర్థ్యాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. ఆవిష్కరణలు, సాంకేతిక పురోగతి వేగంగా పురోగమిస్తున్న తరుణంలో.. సుదూరంలోని ప్రదేశాలు సైతం మన గమ్యస్థానంగా మారుతున్నాయని తెలిపారు.

ప్రయాణం ఇకపై భూమిమీద గల నగరాలకు మాత్రమే పరిమితం కాదని స్పష్టం చేసిన శ్రీ నరేంద్ర మోదీ.. అంతరిక్ష విమానాలు, గ్రహాంతర ప్రయాణాలను వాణిజ్యీకరించాలనే ఆకాంక్షలు పెరుగుతున్న క్రమంలో, వాటిని పౌర విమానయాన రంగంతో అనుసంధానించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇటువంటి పరిణామాలకు సమయం పడుతుందనీ, పరివర్తన, ఆవిష్కరణల కేంద్రంగా విమానయాన రంగ భవిష్యత్తును అవి నిర్దేశిస్తాయని ఆయన పేర్కొన్నారు. దీనికోసం భారత్ పూర్తిగా సిద్ధంగా ఉందని తెలిపారు. భారత విమానయాన రంగానికి మూడు మూలాధారాలను ప్రధానమంత్రి వివరించారు. మొదటిది, విస్తారమైన మార్కెట్.. కేవలం వినియోగదారుల సమాహారం మాత్రమే కాకుండా భారత ఆకాంక్షాత్మక సమాజ ప్రతిబింబం. రెండోది, బలమైన యువత, ప్రతిభావంతుల సమూహం.. ఇక్కడ కృత్రిమ మేధస్సు, రోబోటిక్స్, శుద్ధ ఇంధన రంగాల్లో పురోగతికి యువ ఆవిష్కర్తలు మార్గదర్శకులుగా ఉన్నారు. మూడోది, స్వేచ్ఛాయుత, సహకారాత్మక పరిపాలన వ్యవస్థలు.. పారిశ్రామిక వృద్ధికి వీలు కల్పిస్తాయి. ఈ బలాలతో, భారత్ తన విమానయాన రంగాన్ని అత్యున్నత స్థాయికి తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉందని శ్రీ నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.

గత కొన్నేళ్లలో పౌర విమానయాన రంగంలో భారత్ సాధించిన అద్భుతమైన పరివర్తనను ప్రధాన మంత్రి ప్రస్తావించారు. "ప్రపంచంలోనే మూడో అతిపెద్ద దేశీయ విమానయాన మార్కెట్‌గా భారత్ అవతరించింది'' అని ఆయన తెలిపారు. ఉడాన్ పథకం సాధించిన విజయాన్ని వివరిస్తూ, భారత పౌర విమానయాన చరిత్రలో ఒక సువర్ణాధ్యాయంగా ఆ పథకాన్ని అభివర్ణించారు. ఈ పథకం ద్వారా 15 మిలియన్లకు పైగా ప్రయాణికులు సరసమైన విమాన ప్రయాణ ప్రయోజనం పొందారన్నారు. ఈ పథకం కారణంగా చాలా మంది పౌరులు తొలిసారి విమాన ప్రయాణం చేయగలిగారని శ్రీ నరేంద్ర మోదీ పేర్కొన్నారు. భారత విమానయాన సంస్థలు రెండంకెల వృద్ధిని సాధిస్తూనే ఉన్నాయనీ, ఏటా 240 మిలియన్ల మంది ప్రయాణికులు విమాన ప్రయాణం చేస్తున్నారని తెలిపారు. ఈ సంఖ్య ప్రపంచవ్యాప్తంగా ఉన్న చాలా దేశాల మొత్తం జనాభాను అధిగమించిందని ప్రధానమంత్రి వివరించారు. 2030 నాటికి ఈ సంఖ్య 500 మిలియన్లకు చేరుకుంటుందని ఆయన అంచనా వేశారు. దేశంలో ఏటా 3.5 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకు రవాణా జరుగుతోందని, ఈ దశాబ్దం చివరి నాటికి ఈ పరిమాణం 10 మిలియన్ మెట్రిక్ టన్నులకు పెరగనుందని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

ఈ గణాంకాలు కేవలం అంకెలు మాత్రమే కాదని, అపారమైన భారత సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తున్నాయని స్పష్టం చేశారు. ఈ సామర్థ్యాన్ని మరింత మెరుగుపరిచే భవిష్యత్ ప్రణాళికల రూపకల్పన కోసం భారత్ కృషి చేస్తోందని తెలిపారు. ప్రపంచ స్థాయి విమానాశ్రయ మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం భారత్ గణనీయంగా పెట్టుబడులు పెడుతోందని తెలిపిన ప్రధానమంత్రి, 2014లో దేశంలో 74 విమానాశ్రయాల్లో కార్యకలాపాలు సాగుతుండగా, ప్రస్తుతం వాటి సంఖ్య 162కి పెరిగిందని పేర్కొన్నారు. భారత విమానయాన సంస్థలు 2 వేలకు పైగా కొత్త విమానాల కోసం ఆర్డర్లు ఇచ్చాయని, ఇది ఈ రంగంలో వేగవంతమైన వృద్ధిని సూచిస్తుందని శ్రీ నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. భారత విమానయాన రంగం అత్యున్నత స్థాయికి చేరే మార్గంలో కీలకమైన టేకాఫ్ దశలో ఉందనీ, ఇది ప్రారంభం మాత్రమేనని తెలిపారు. ఈ పరివర్తన భౌగోళిక సరిహద్దులను అధిగమించడమే కాకుండా.. ఈ రంగాన్ని సుస్థిరత, పర్యావరణహితమైన రవాణా, ప్రపంచవ్యాప్తంగా అందరికీ సమానంగా అందుబాటు ఉండడం దిశగా ముందుకు నడిపిస్తోందని వివరించారు.

"భారత విమానాశ్రయాలు ఇప్పుడు సంవత్సరానికి 500 మిలియన్ల మంది ప్రయాణికుల నిర్వహణ సామర్థ్యాన్ని కలిగి ఉండి, సాంకేతికత ద్వారా వినియోగదారుల అనుభవంలో సరికొత్త ప్రమాణాలను నిర్దేశిస్తున్న అతికొద్ది దేశాల్లో ఒకటిగా భారత్‌ను నిలుపుతున్నాయి" అని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. భద్రత, సామర్థ్యం, సుస్థిరతకు సమాన ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. సుస్థిరమైన విమాన ఇంధనాలు, పర్యావరణహితమైన సాంకేతికతల్లో పెట్టుబడులు, కర్బన ఉద్గారాల తగ్గింపు ప్రయత్నాల దిశగా భారత పరివర్తనను ఆయన స్పష్టం చేశారు. అభివృద్ధి పట్ల సమతుల్య విధానాన్ని బలోపేతం చేస్తూ, పురోగతి, పర్యావరణ భద్రత రెండింటికీ కట్టుబడి భారత్ ముందుకుసాగుతోందని శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు.

డిజిటల్ ఏవియేషన్ కోసం ఒక మార్గదర్శక ఉదాహరణగా నిలిచే డిజి యాత్ర యాప్ గురించి అంతర్జాతీయ అతిథులు అవగాహన కలిగి ఉండి, దీనిని సద్వినియోగం చేసుకోవాలని ప్రధానమంత్రి కోరారు. ముఖ ధృవీకరణ సాంకేతికత సహాయంతో ప్రయాణికులు అవసరమైన పత్రాలు, గుర్తింపు రుజువులను చూపించే అవసరం లేకుండా విమానాశ్రయ ప్రవేశ ద్వారం నుంచి బోర్డింగ్ ద్వారాల వరకు సజావుగా ముందుకు సాగేందుకు డిజి యాత్ర యాప్ వీలు కల్పిస్తుందని ప్రధానమంత్రి వివరించారు. అత్యంత ఎక్కువ జనాభాకు సేవలందించడంలో భారత ఆవిష్కరణలు, అనుభవం అనేక దేశాలకు ప్రయోజనం చేకూరుస్తున్నాయని శ్రీ నరేంద్ర మోదీ పేర్కొన్నారు. "దక్షిణార్ధ గోళంలోని దేశాల కోసం ప్రేరణాత్మక నమూనాగా పనిచేసే ఈ డిజి యాత్ర.. సురక్షితమైన, స్మార్ట్ పరిష్కారంగా నిలుస్తుంది" అని ఆయన తెలిపారు.

దేశంలో వేగంగా విస్తరిస్తున్న విమానయాన రంగానికి నిరంతర సంస్కరణలు కీలకమైన చోదక శక్తిగా ఉన్నాయని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. ఈ దార్శనికతకు మద్దతునిచ్చే వ్యూహాత్మక చొరవలతో ప్రపంచ తయారీ కేంద్రంగా మారడం పట్ల భారత నిబద్ధతను ఆయన వివరించారు. ఈ సంవత్సరం బడ్జెట్‌లో మిషన్ మానుఫాక్చరింగ్ ప్రకటన ద్వారా పారిశ్రామిక వృద్ధిపై దృష్టిని భారత్ మరింత బలోపేతం చేస్తుందని తెలిపారు.

ఈ సంవత్సరం పార్లమెంటు ఆమోదం పొందిన విమాన విడిభాగాల బిల్లులోని ప్రొటెక్షన్ ఆఫ్ ఇంట్రెస్ట్ గురించి ప్రస్తావించిన ప్రధానమంత్రి.. ఇది భారత్‌లో కేప్‌టౌన్ ఒప్పందానికి చట్టపరమైన అధికారాలను కల్పించిందని తెలిపారు. ఈ చట్టం, ప్రపంచ విమాన లీజింగ్ కంపెనీలకు భారత్‌లో కొత్త అవకాశాలను అందించిందన్నారు. గిఫ్ట్ సిటీలో అందించే ప్రోత్సాహకాలను గురించి వివరించిన ఆయన, ఈ చర్యలు విమాన లీజింగ్ కోసం ఆకర్షణీయమైన గమ్యస్థానంగా భారత్‌ను నిలిపాయని పేర్కొన్నారు.

"కొత్త ఇండియన్ ఎయిర్‌క్రాఫ్ట్ చట్టం ప్రపంచ అత్యుత్తమ పద్ధతులకు అనుగుణంగా విమానయాన చట్టాలను రూపొందిస్తూ.. క్రమబద్ధీకరించిన నియంత్రణ వ్యవస్థ, అనుమతుల సౌలభ్యం, సరళీకృత పన్ను నిర్మాణాలకు భరోసానిస్తుంది. ఇది ప్రధాన అంతర్జాతీయ విమానయాన సంస్థలకు గణనీయమైన పెట్టుబడి అవకాశాలను అందిస్తుంది" అని శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు. విమానయాన రంగంలో వృద్ధి కొత్త విమానాలు, కొత్త ఉద్యోగాలు, కొత్త అవకాశాలకు దారితీస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ రంగంలో పైలట్లు, సిబ్బంది, ఇంజనీర్లు, గ్రౌండ్ స్టాఫ్ కోసం అపారమైన అవకాశాలు అందుబాటులోకి రానున్నాయని ఆయన పేర్కొన్నారు. కొత్తగా అభివృద్ధి చెందుతున్న నిర్వహణ, మరమ్మత్తు, ఓవర్‌హాల్ (ఎమ్ఆర్ఓ) కేంద్రాల గురించి ప్రధానమంత్రి ప్రస్తావించారు. విమాన నిర్వహణలో ప్రపంచ కేంద్రంగా మారే దిశగా భారత్ ప్రయత్నాలను వేగవంతం చేస్తోందని ఆయన తెలిపారు. 2014లో దేశంలో 96 ఎమ్ఆర్ఓ కేంద్రాలు ఉండగా, వాటి సంఖ్య ప్రస్తుతం 154కి పెరిగిందన్నారు. ఆటోమేటిక్ రూట్, జీఎస్‌టీ తగ్గింపు, పన్నుల హేతుబద్ధీకరణ చర్యలు భారత ఎమ్ఆర్ఓ రంగానికి కొత్త ఊపునిచ్చాయని శ్రీ నరేంద్ర మోదీ పేర్కొన్నారు. 2030 నాటికి 4 బిలియన్ డాలర్ల విలువైన ఎమ్ఆర్ఓ హబ్ స్థాపించాలనే భారత లక్ష్యాన్ని వివరించిన ఆయన, ఇది దేశ విమానయాన రంగ అభివృద్ధి వ్యూహాన్ని మరింత బలోపేతం చేస్తుందన్నారు.

భారత్‌ను కేవలం విమానయాన మార్కెట్‌గా పరిగణించరాదన్న ప్రధానమంత్రి, వాల్యూ–చెయిన్ లీడర్‌గా చూడాలని స్పష్టం చేశారు. డిజైన్ నుంచి డెలివరీ వరకు ప్రపంచ విమానయాన సప్లయి చెయిన్‌లో భారత్ అంతర్భాగంగా మారుతోందని ఆయన పేర్కొన్నారు. భారత దిశ, వేగం సరైన మార్గంలో ఉన్నాయన్న ఆయన.. నిరంతర వేగవంతమైన దేశ పురోగతి పట్ల విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రపంచ విమానయాన ఆవిష్కరణల్లో భారత నాయకత్వ దార్శనికతను బలోపేతం చేస్తూ, 'మేక్ ఇన్ ఇండియా' మాత్రమే కాకుండా 'డిజైన్ ఇన్ ఇండియా' స్ఫూర్తిగా పనిచేయాలని విమానయాన సంస్థలకు ప్రధానమంత్రి విజ్ఞప్తి చేశారు.

భారత విమానయాన రంగం దాని సమ్మిళిత నమూనా ద్వారా బలోపేతం అయ్యిందన్న ప్రధానమంత్రి.. దేశంలో 15 శాతానికి పైగా పైలట్లు మహిళలేనని, ఇది ప్రపంచ సగటు కంటే మూడు రెట్లు ఎక్కువ అన్నారు.

క్యాబిన్ సిబ్బందిలో మహిళల ప్రపంచ సగటు 70 శాతం ఉండగా, భారత్‌లో ఇది 86 శాతంగా ఉందని తెలిపారు. దేశంలోని ఎమ్ఆర్ఓ రంగంలో మహిళా ఇంజనీర్ల సంఖ్య ప్రపంచ సగటును మించిపోయిందనీ, ఇది ఈ రంగంలో పెరుగుతున్న మహిళా భాగస్వామ్యానికి నిదర్శనమని శ్రీ నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు.

విమానయాన రంగ భవిష్యత్తులో డ్రోన్ సాంకేతికత అత్యంత కీలకమైనదని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. సాంకేతిక పురోగతితో పాటు ఆర్థిక–సామాజిక సమగ్రత కోసం భారత్ దీనిని చక్కగా ఉపయోగించుకుంటోందని తెలిపారు. మహిళా స్వయం సహాయక బృందాలకు సాధికారత కల్పించడానికి.. వ్యవసాయం, డెలివరీ సేవలు, విభిన్న రంగాల్లో వారి భాగస్వామ్యాన్ని పెంచడానికి డ్రోన్‌లను ఉపయోగిస్తున్నారని ఆయన వివరించారు.

"విమానయాన భద్రతకు ఎల్లప్పుడూ భారత్ అత్యంత ప్రాధాన్యం ఇస్తుంది. ఐసీఏఓ సూచించిన ప్రపంచస్థాయి ప్రమాణాలకు అనుగుణంగా భారత్ తన నిబంధనల్లో మార్పులు చేసింది" అని శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు. అంతర్జాతీయంగా అనుసరిస్తున్న అత్యుత్తమ పద్ధతుల అమలు పట్ల భారత నిబద్ధతను ఇది మరింత బలపరిచిందన్నారు. ఐసీఏఓ ఇటీవల నిర్వహించిన భద్రతా ఆడిట్ సందర్భంగా, విమానయాన భద్రత బలోపేతం కోసం భారత్ చేస్తున్న ప్రయత్నాలను ప్రశంసించిందని తెలిపారు. ఆసియా–పసిఫిక్ మంత్రులస్థాయి సదస్సులో ఢిల్లీ డిక్లరేషన్‌ను ఆమోదించడం.. ప్రపంచ విమానయాన నైపుణ్యాల పట్ల భారత నిబద్ధతను మరింత స్పష్టం చేసిందని ప్రధానమంత్రి వివరించారు.

భారత్ ఎప్పుడూ స్వేచ్ఛాయుత గగనతలం, గ్లోబల్ కనెక్టివిటీకి మద్దతునిస్తుందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. మరింత అనుసంధానితమైన, అందుబాటులో ఉండే విమానయాన నెట్‌వర్క్ కోసం అనుకూలంగా వాదిస్తూ, చికాగో ఒప్పంద నియమాలను భారత్ ఆమోదిస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. విమాన ప్రయాణం అందరికీ అందుబాటులో, సరసమైనదిగా, సురక్షితమైనదిగా ఉండేలా చేయడం కోసం సంబంధిత సంస్థలు, విభాగాలు కలిసి పనిచేయాలని శ్రీ నరేంద్ర మోదీ సూచించారు. విమానయానాన్ని అత్యున్నత స్థాయికి తీసుకెళ్లే కొత్త పరిష్కారాలను అభివృద్ధి చేయగల ఈ రంగం సామర్థ్యం పట్ల విశ్వాసాన్ని వ్యక్తం చేస్తూ, సంబంధిత సంస్థలు, విభాగాలకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు శ్రీ కింజరాపు రామ్ మోహన్ నాయుడు, శ్రీ మురళీధర్ మొహోల్, ఐఏటీఏ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్మన్ శ్రీ పీటర్ ఎల్బర్స్, ఐఏటీఏ డైరెక్టర్ జనరల్ శ్రీ విల్లీ వాల్ష్, ఇండిగో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ రాహుల్ భాటియా తదితరులు పాల్గొన్నారు.



# పీఏసీఎస్‌లకు రుణ సదుపాయం విస్తరణ పథకంలో పీఏసీఎస్‌లకు క్రియాశీలక భాగస్వామ్యం

న్యూఢిల్లీ, జూన్ 3:సహకార రంగంలో ప్రపంచంలోనే అతిపెద్ద ఆహార ధాన్యాల నిల్వ పథకంపై కేంద్రహోం, , సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా న్యూఢిల్లీలో సమీక్ష నిర్వహించారు. సహకార శాఖ సహాయ మంత్రులు శ్రీ క్రిషన్ పాల్ గుర్జార్, శ్రీ మురళీధర్ మొహోల్ లతో పాటు సహకార, ఆహార, ప్రజా పంపిణీ, వినియోగదారుల వ్యవహారాలు, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్సిఐ), నాబార్డ్, నేషనల్ కోఆపరేటివ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ (ఎన్ సిడిసి), ఇతర సంస్థల అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఈ సమావేశంలో శ్రీ అమిత్ షా ప్రసంగిస్తూ, ప్రపంచంలోనే అతిపెద్ద ఆహార ధాన్యాల నిల్వ పథకం ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికత - సహకర్ సే సమృద్ధి - ని సాకారం చేసే దిశగా ఒక పెద్ద అడుగు అని అన్నారు. భారత్ లో ఆర్థిక పురోగతిని కొలవడానికి స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ), ఉపాధి కల్పన అనే రెండు ప్రధాన కొలమానాలు ఉన్నాయని ఆయన చెప్పారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల (పీఏసీఎస్) ఆదాయాన్ని పెంచడంతో పాటు గ్రామీణ ఉపాధి అవకాశాలను సృష్టించడం లక్ష్యంగా ఈ రెండు అంశాలను బలోపేతం చేయడానికి ఆహార నిల్వ పథకాన్ని ఉద్దేశించారు. అగ్రికల్చర్‌ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (ఏఐఎఫ్) కింద రుణ వ్యవధిని పొడిగించడం ద్వారా పీఏసీఎస్ ల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని శ్రీ అమిత్ షా స్పష్టం చేశారు.

ఆహార నిల్వ పథకంలో పీఏసీఎస్ ల విస్తృత భాగస్వామ్యం అవసరాన్ని ఉద్ఘాటిస్తూ, పీఏసీఎస్ లను ఈ పథకంలో అంతర్భాగం చేయడం తప్పనిసరి అని,తద్వారా పీఏసీఎస్ ల ఆర్థిక సామర్థ్యాన్ని, సామాజిక ప్రభావాన్ని నిర్ధారించవచ్చని కేంద్ర సహకార మంత్రి అన్నారు. ప్రాంతీయ అవసరాలకు అనుగుణంగా పథకం అమలు సజావుగా జరిగేలా దేశవ్యాప్తంగా గోదాముల జాతీయ స్థాయి మ్యాపింగ్ నిర్వహించాలని కేంద్ర ఆహార, ప్రజాపంపిణీ మంత్రిత్వ శాఖ, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలను శ్రీ అమిత్ షా ఆదేశించారు. పీఏసీఎస్ లను వీలైనన్ని ఎక్కువ గోదాములతో అనుసంధానం చేయాలని ఎఫ్సీఐ, ఎన్ సీసీఎఫ్, నాఫెడ్, స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్లను కూడా ఆయన ఆదేశించారు.

సంపూర్ణ సహకార సరఫరా గొలుసు మార్గాన్ని అభివృద్ధి చేయడానికి రాష్ట్రాలు తమ స్థాయిలో ఈ పథకంలో మరిన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను చేర్చాలని, అలాగే రాష్ట్ర స్థాయి మార్కెటింగ్ సమాఖ్యలను కూడా దీనితో అనుసంధానించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.

'ఆత్మనిర్భర్ భారత్', 'సహకర్ సే సమృద్ధి' లక్ష్యాలను సాధించడంలో ఒక మైలురాయిగా నిలిచేలా అన్ని సంస్థలను సమన్వయం చేసుకుని సకాలంలో, సమర్థవంతంగా ఈ పథకాన్ని అమలు చేయాలని కేంద్ర సహకార మంత్రి శ్రీ అమిత్ షా పిలుపునిచ్చారు.

# జన్నారం నూతన ఎస్సైగా అనూష నియామకం

ఆదిలాబాద్, జూన్ 3:జన్నారం నూతన ఎస్సైగా గొల్లపెల్లి అనూషను రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా నియమిస్తూ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ఇక్కడ పనిచేసిన గుండేటి రాజవర్ధన్ ను సీపీ కార్యాలయానికి వీఆర్ కు అటాచ్ గా ఆకస్మికంగా బదిలీ చేస్తూ ఆదేశించారు.

ఇక్కడ పనిచేసిన రాజవర్ధన్ 2024 మార్చ్ 16న బాధ్యతలు స్వీకరించి, జూన్ 2 వరకు పనిచేశారు. ఎస్సై రాజవర్ధన్ ను ఆకస్మికంగా బదిలీ చేశారు. ఆయన ఎస్సైగా ఇక్కడ పనిచేసిన 14 నెలల కాలంలో అటు అధికారుల ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ, ప్రజలతోనూ ప్రజాప్రతినిధులతో మమేకమై మంచిపేరు తెచ్చుకొని, మన్ననలు పొందారు. గంజాయిని సేవించే యువకులకు కౌన్సిలింగ్ ఇస్తూ నిర్మూలించడంలోనూ, వాహన దొంగలను పట్టుకోవడంలోనూ, శాంతి భద్రతల పరిరక్షణలోనూ ఆయన మంచి చొరవ చూపారు.

# ఏ ఒక్క హామీని పూర్తి స్థాయిలో ప్రజలకు అందించక పోవడం ప్రభుత్వ వైఫల్యమే- ఈదురు ఐలయ్య




మహబూబాబాద్, జూన్ 2: (నేటినిజం ప్రతినిధి): జూన్ 2వతారీఖు రాష్ట్ర అవతరణ దినోత్సవము సందర్భంగా గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధి దారులకు మంజూరి ప్రొసీడింగ్ ఇస్తామని చెప్పి దొంగచాటుగా స్థానిక ఎం ఎల్ ఏ ఈరోజు పెద్దవంగరలో కొంత మందికే ఇవ్వడం అన్యాయమని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈదురు ఐలయ్య బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు అన్నారు ప్రజలకు మేము ప్రజా పాలన అందిస్తామని చెప్పే కాంగ్రెస్ నాయకులు గ్రామాలలో నే ఈ ప్రొసీడింగ్స్ యివ్వకపోవటం ప్రజా పాలన ఏ విధంగా ఔతుందో కాంగ్రెస్ నాయకులు చెప్పాలని డిమాండ్ చేశారు .కొన్నిపథకాలు కొందరికే ఇచ్చుకుంటూ ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు తెలంగాణ రాష్ట్రం లో ఆరు గ్యారంటీ ల పేరుతో అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సిఎం రేవంత్ రెడ్డి ఏ ఒక్క హామీని పూర్తి స్థాయిలో ప్రజలకు అందించక పోవడంతో పాటు రాష్ట్రంలో టైంపాస్ పాలనను కొనసాగిస్తున్నారని విమర్శించారు.

# రైతులు ప్రతీ చిన్న భూ సమస్యను భూ భారతి రెవెన్యూ సదస్సులలో దరఖాస్తు చేసుకోవాలి

## -జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

సంగారెడ్డి జూన్ 03(నేటి నిజం ప్రతినిది) నూతన రెవెన్యూ చట్టం భూభారతి అమలులో భాగంగా నేటి నుంచి జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వ హించనున్నట్లు జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు తెలిపారు.




అందులో భాగంగా సంగారెడ్డి మండలం ఇస్మాయిల్ ఖాన్ పేట గ్రామంలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో టీజీఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి తో కలిసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ రైతులు ఏ చిన్న, భూ సమస్యనైనా రెవెన్యూ సదస్సులలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.భూ భారతి చట్టం ఏప్రిల్ 14న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించాడం జరిగిందన్నారు.నేటి నుంచి 20 వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా మిగిలిన అన్ని మండలాల్లో" ప్రజల వద్దకే రెవెన్యూ నినాదం'తో సదస్సులు నిర్వహిస్తాం అని, అన్ని రెవెన్యూ గ్రామాలకు తహసీల్దార్ కూడిన బృందం వెల్లి ప్రజల నుంచి భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి, పరిష్కరిస్తుందన్నారు.

వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడుఆన్లైన్లో నమోదు చేయడంతో పాటు సమస్యలు పరిష్కరిస్తారన్నారు. అన్ని రకాల భూ సమస్యలను పరిష్కరించాలన్నారు.

భూ సమస్యలను అధికారులు మానవీయ కోణంలో పరిష్కరించాని ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

టీజీ ఐ ఐ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి× మాట్లాడుతూ భూ భారతి చట్టం రైతుల చుట్టం అని ,గతంలో ధరణి తో రైతులు ఇబ్బంది పడ్డారని ,కార్యాలయాల చుట్టూ,కోర్టు ల చుట్టూ తిరిగరన్నారు.

ముఖ్య మంత్రి మాట ప్రకారం అధికారులే ప్రజల వద్దకు వస్తున్నారని అన్నారు. వ్యక్తికి ఆధార్ భూమికి భూదార్ కూడా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే అన్ని హామీలు అన్ని నెరవేరుస్తున్నారని, 6 గ్యారంటీల అమాలు తప్పకుండా చేస్తామన్నారు.

ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ రవీందర్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి ఖాసిం బేగ్, రెవెన్యూ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తప్పుడు కేసులు పెడతారా - కూటమి ప్రభుత్వాన్ని నిలదీసిన జగన్

అమరావతి, జూన్ 3:రెడ్ బుక్ రాజ్యాంగంలో రాష్ట్ర పాలన అదుపు తప్పిందని, పోలీసు వ్యవస్థ దిగజారిపోయిందని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. తెనాలిలోని నడివీధిలో ముగ్గురు యువకులను పోలీసులు చితకకొట్టిన ఘటనలో బాధితులను పరామర్శించేందుకు మంగళవారం ఆయన తెనాలికి వచ్చారు. ముగ్గురు యువకులు కుటుంబాలను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా జగన్ మోహన్ రెడ్డి విలేఖరులతో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు అన్యాయాలు ఇలానే కొనసాగితే రాష్ట్ర ప్రజలకు తీరని నష్టం జరుగుతుంని, వీరి మోసాలు, పరిపాలన మీద, అబద్దపు హామీలతో ప్రజలను మోసం చేయడంపై నిరసనగా జూన్ 4న వెన్నుపోటు దినం కార్యక్రమాలు చేపట్టమని, ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు మీద 24 కేసులున్నాయి.. అలా కేసులు ఉన్నాయని చెప్పి చంద్రబాబును రోడ్డుపైకి తీసుకొచ్చి తన్నడం ధర్మమేనా? అలా చేయడం ధర్మం అవుతుందా? అని జగన్‌మోహన్ రెడ్డి ప్రశ్నించారు. మరి తెనాలి ఘటనలో పోలీసులు ఎందుకు అంత దారుణంగా వ్యవహరించారని నిలదీశారు. కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు పాలన, రెడ్ బుక్ రాజ్యాంగంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. తెనాలి ఘటన బాధితులు రాకేష్, విక్టర్, కరీముల్లాతో పాటు వారి కుటుంబ సభ్యులు కూడా ఉన్నత చదువులు చదువుకున్న వారే అని, పోలీసులు వారి కుటుంబాల పరువును అన్యాయంగా బజారుకీడ్చారని ధ్వజమెత్తారు.

సివిల్ డ్రెస్‌లో ఉన్న కానిస్టేబుల్‌ను ప్రశ్నించడం వీరు చేసిన తప్పా? అని ప్రశ్నించారు. ఏప్రిల్ 24న కానిస్టేబుల్‌ను యువకులు ప్రశ్నిస్తే.. 25న పోలీసులు మంగళగిరి వెల్లి జాన్ విక్టర్‌ను, కరీముల్లాను కొట్టుకుంటూ తీసుకొచ్చారని, తర్వాత తెనాలి పోలీసు స్టేషన్‌లో కూడా పడేసి మరీ కొట్టారని, ఏప్రిల్ 26న తెనాలి ఐతానగర్ నడిరోడ్డు మీద పడేసి ముగ్గురి చితకబాదారని, ఇదెక్కడ న్యాయమని జగన్ ప్రశ్నించారు. 24 గంటల్లో కోర్టులో ఎందుకు హాజరు పరచలేదని నిలదీశారు. కోర్టుకు ప్రవేశపెట్టే ముందు వీరిని ఆసుపత్రికి ఎందుకు తీసుకెళ్లారని, ఆసుపత్రిలో వైద్యులు బాధితులకు ఉన్న గాయాలను ఎందుకు గుర్తించలేదని నిలదీశారు.తెనాలిలో వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి పర్యటనను వ్యతిరేకిస్తూ దళిత, ప్రజాసంఘాలు రాస్తారోకో నిర్వహించాయి. తెనాలి మార్కెట్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి ఆందోళన చేపట్టారు. వైసీపీ హయాంలో హత్యకు గురైన నూతక్కి కిరణ్‌ను జగన్ పరామర్శించలేదని రౌడీషీటర్లకు మద్దతుగా నిలవడం దారుణమంటూ దళిత, ప్రజాసంఘాలు నినాదాలు చేశాయి. ఐతానగర్ సెంటర్‌లో జగన్‌ను ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు అడ్డుకున్నారు. జగన్ గో బ్యాక్ అంటూ ఆందోళనకారులు నినాదాలు చేశారు. తెనాలిలో ఎర్ర బడి వద్ద జగన్ కాన్వాయ్‌ను ఎమ్మార్పీఎస్, దళిత సంఘాల నేతలు అడ్డుకున్నారు. దళితులపై ఇప్పుడు ప్రేమ పుట్టు కొచ్చిందా అంటూ నిరసన వ్యక్తం చేశారు.

# రూ. 10.11 కోట్ల గంజాయి, డ్రగ్స్ దహనం..

## -27 కేసుల్లో పట్టుబడిన గంజాయి, డ్రగ్స్‌ను కాల్చివేత.



సంగారెడ్డి జూన్ 03(నేటి నిజం ప్రతినిది)సంగారెడ్డి జిల్లాలోని నాలుగు ఎక్సైజ్ స్టేషన్లలో 27 కేసుల్లో పట్టుబడిన గంజాయి, ఆల్ప్రజోలం, డైజో ఫామ్ ,లాంటి మత్తు పదార్థాలను మంగళవారం కల్చివేశారు.

మెదక్ డిప్యూటి కమిషనర్ జె. హరి కిషన్ డిస్పోజల్ అధికారిగా ఇచ్చిన అదేశాల మేరకు సంగారెడ్డి జిల్లాలోని నాలుగు ఎక్సైజ్ స్టేషన్లలో పట్టుబడిన మత్తు పదార్థాలను మెడికేర్ వెస్టేజ్ మేనేజ్‌మెంట్ ఇస్నాపూర్ ప్రాంతంలో కాల్చి వేశారు.

పటాన్ చెరువు స్టేషన్‌లో 10 కేసులు, సంగారెడ్డి స్టేషన్‌లో 7 కేసులు, నాయయణ ఖేడ్ లో 3, ఆదోల్‌లో నాలుగు కేసుల్లో పట్టుబడిన డ్రగ్స్, గంజాయిని సంగారెడ్డి ఎక్సైజ్ సూపరిండెంట్ నవీన్ చందర్ అధ్వర్యంలో దాహనం చేశారు.

209.162 కేజీల గంజాయి, 7 గ్రాముల డైజోఫామ్ , 0.496 కేజీల ఆల్ప్రజోలం 0.468 కేజీల పప్పిస్ట్రా, 3 ఎంఎంసీ 90.23 కేజీలను దాహనం చేశారు.

దహనం చేసిన డ్రగ్స్ విలువ రూ. 10.11 కోట్లుగా ఉంటుందని ఎక్సైజ్ సూపరిండెంట్ నవీన్ చందార్ తెలిపారు.

# బ్యాంకులు ఖాతాదారుల యొక్క రుణ లక్ష్యాలను సాధించాలి

## - జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

సంగారెడ్డి జూన్ 03(నేటి నిజం ప్రతినిది) కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా బ్యాంకార్లతో మహిళా సంఘాలకు ,వాణిజ్య వ్యాపార, రాజీవ్ యువ వికాసం, ముద్ర లోన్లు, మహిళా డ్రైవర్లకు, డ్రోన్ ఆపరేటర్లకు, ఇటుకల తయారీదారులకు, ట్రైలరింగ్ మగ్గం వర్క్ పనులు చేసే వారికి , ఇతర రుణా సహాయంపై సమీక్ష సమావేశం నిర్వహించారు.




ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ బ్యాంకర్లు ఖాతాదారులకు రుణాల యొక్క లక్ష్యాలను సాధించాలని బ్యాంకారులను ఆదేశించారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టత్మ కార్యక్రమం రాజీవ్ యువ వికాసం పథకం కింద లబ్ది దారులకు 90% ప్రభుత్వం మే భరిస్తుందనీ, బ్యాంకర్స్ కు ఎటువంటి ఆర్థిక భారం లేదన్నారు. బ్యాంకర్లు మహిళ సంఘాలకు ,వాణిజ్య వ్యాపార,రాజీవ్ యువ వికాసం, ముద్ర రుణాలు, మహిళా డ్రైవర్లకు, డ్రోన్ ఆపరేటర్లకు ,ఇటుకల తయారీదారులకు ,ట్రైలరింగ్ చేసే వారికి ,మగ్గం పని వారికి ఇంకా ఇతర స్థాయిలో ఉన్నవారికి రుణాలు అందించాలని ,

రుణాలు అందించి బ్యాంకుల యొక్క రుణాల లక్ష్యాలను సాధించాలన్నారు. మహిళా సంఘాలకు డ్వాక్రా రుణాలతో పాటు పర్సనల్ రుణాలు కూడా మంజూరు చేయాలన్నారు.రుణాల సహాయం లో ఖాతాదారులను ఎలాంటి అసౌకర్యాలకు గురి చేయకుండా రుణ సదుపాయం కల్పించాలన్నారు.

2024 25 ఆర్థిక సంవత్సరానికి రుణ లక్ష్యాలు సాధించి జిల్లా ప్రజల అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఎల్డీఎం నరసింహ రావు, పిడి డిఆర్డిఏ జ్యోతి, ఈ డి ఎస్ సి కార్పొరేషన్ రామాచారి, ఎస్టి గిరిజన సంక్షేమ శాఖ అధికారి అఖిలేష్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీష్, మెప్మా పిడి గీత ,బ్యాంకర్లు ,అధికారులు పాల్గొన్నారు.

# టీటీడీ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు




హైదరాబాద్, జూన్ 3:హిమాయత్ నగర్ లోని టీటీడీ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ప్రారంభమయ్యాయి..ఈ ఉత్సవాలు ఏడో తేది వరకు కొనసాగుతాయి..

ఈ పవిత్ర బ్రహ్మోత్సవాలుకు సోమవారం నాడు అనుకూరార్పణంతో చేశారు..ఇక బ్రహ్మోత్సవాల్లో ఆరంభ సూచికగా ధ్వజారోహణం గావించారు. అనంతరం ఉదయం శేష వాహన సేవ నిర్వహించారు.. రాత్రికి శ్రీ హనుమంత హాహన సేవ జరగనుంది?అలాగే వివిధ రోజులలో గరుడ వాహనం, సూర్యప్రభ వాహనం, చంద్రప్రభ వాహనం, గజ వాహనం, అశ్వ వాహనం , రథోత్సవం, అన్నప్రసాదం పంపిణీ తదితర వేడుకలు జరుగుతాయి.

# రాజ్ కపూర్‌కు వందేళ్లు: సినీతార మాత్రమే కాదు... ఈ దేశపు నైతిక అంతర్వాణి

న్యూఢిల్లీ, జూన్ 3:'మేరా నామ్ జోకర్', 'బాబీ' వంటి సినిమాలను యువతీయువకులు తమ మదిలో పదిల పరచుకొనేవిగా తీర్చిదిద్ది, యువతలో ఓ ఉద్వేగాన్ని రగిలించారు రాజ్ కపూర్. మీరు సినిమా హాలుకు వెళ్లి సినిమా చూడలేదు... సినిమా టికెట్టు కొనేందుకు అప్పు చేయలేదు? అంటే సినీ మాయాజాలం గురించి మీకు తెలియదన్నట్లే! రాజ్ కపూర్ వట్టి సినిమాలే తీయలేదు. ఆయన తీయనైన తిరుగుబాటుకు స్ఫూర్తి. మనం ఆ మధురమైన జ్ఞాపకాలను సగర్వంగా స్మరించుకొంటున్నాం" అని ఐజీఎన్‌సీఏ సభ్య కార్యదర్శి డాక్టర్ సచ్చిదానంద్ జోషి అభివర్ణించారు. రాజ్ కపూర్ శతజయంతి ఉత్సవం- 2025 సందర్భంగా అట్టహాసంగా నిర్వహించిన కార్యక్రమానికి అనేక మంది మేధావులు పాల్గొనగా, వారిని ఉద్దేశించి డాక్టర్ సచ్చిదానంద్ జోషి భావావేశంతో చెప్పిన మాటలు సభాస్థలిలో మార్మోగి చిక్కని అనుభవాన్ని అందించాయి. ఢిల్లీకి చెందిన రెస్పెక్ట్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ కార్యక్రమానికి 'శబ్దాంజలి: రాజ్ కపూర్- ది ఐడియా ఆఫ్ షోమాన్‌షిప్' అనే శీర్షికను ఉంచారు. భారతదేశంలో అత్యంత విశిష్ట సినిమా దర్శకుల్లో ఒకరైన మహనీయునికి సంవత్సరం పొడవునా నివాళి అర్పిస్తూ నిర్వహించే ఉత్సవానికి దీంతో లాంఛనప్రాయగా నాందీప్రస్తావన జరిగినట్లయింది.

న్యూఢిల్లీలోని ఇండియా ఇంటరేషనల్ సెంటర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సాయంత్రం వేళ జరిగిన సదస్సుకు సిక్కిం మాజీ గవర్నరు శ్రీ బి.పి. సింగ్ అధ్యక్షత వహించగా, పార్లమెంట్ సభ్యుడు శ్రీ మనోజ్ తివారీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ , పద్మ శ్రీ డాక్టర్ యశ్ గులాటీ, సీనియర్ నటుడు శ్రీ ముకేశ్ త్యాగి గౌరవ అతిథులుగా విచ్చేశారు. భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ అదనపు కార్యదర్శి శ్రీమతి నిరుపమ కొట్రు- ఐఆర్ఎస్ కీలకోపన్యాసాన్నిచ్చారు. సభా కార్యక్రమం ఆరంభంలో రెస్పెక్ట్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ నిర్మల్ గహ్లోత్ ఆహ్వానితులకు స్నేహపూర్వక స్వాగత వచనాలు పలికారు.

రాజ్ కపూర్ ది వినోద రంగంలో అందె వేసిన చేయి. అంతే కాదు, మన దేశంలో యువతీయువకులతో పాటు మారుతున్న దేశానికి ఒక నైతిక దర్పణం కూడా అని డాక్టర్ జోషి విశ్లేషించారు. ఆయన చలనచిత్రాల్లో కళ్లు చెదిరే ఉదంతాలతో పాటు అప్పుడే రూపుదాల్చిన నూతన స్వతంత్ర దేశంలో మానవ భావావేశాలు, నైతిక మీమాంసలను వడబోసిన లోతైన సాంస్కృతిక సన్నివేశాలు కూడా ఒకదాని తరువాత మరొకటిగా పోగుపడేవి. భారత్ వలసవాద ఛాయల నుంచి బయటకు వచ్చాక, స్వీయ గుర్తింపు కోసం తపిస్తున్న ప్రజలకు అర్థం చేసుకోదగ్గ చలనచిత్ర పరిభాషను కపూర్ అందించారు. "ఇండియా స్వాతంత్ర్యాన్ని సంపాదించుకున్నాక, చలనచిత్ర పరిశ్రమ కూడా స్వేచ్ఛావాయువులను పీల్చుకొనేటంత దాకా కపూర్ వేచి ఉండలేదు. మూడు సంవత్సరాల స్వల్ప కాలంలోనే ఆయన మనకు 'ఆగ్', 'బర్సాత్', 'ఆవారా' వంటి సినిమాలను అందించారు. మానసిక అంతర్మథనం పొరలు పొరలుగా విప్పుకొన్నాయి ఆ సినిమాల్లో. సినిమా భాష ఒకటొకటిగా వర్ణమాల స్థాయిని అందిపుచ్చుకుంటూ ఉన్న కాలమది'' అని డాక్టర్ జోషి వక్కాణించారు. కపూర్ సినిమాలు వినోదానికి, ప్రబోధాత్మకతకు మధ్య గల రేఖలను తుడిచివేస్తూ, ఒక దేశ ప్రజానీకం సామూహిక మానసాన్ని తీర్చిదిద్దాయని ఆయన భాష్యం చెప్పారు.శ్రీమతి నిరుపమ కొట్రు ప్రారంభోప న్యాసమిస్తూ, కపూర్ గారి చలనచిత్రాలు సామాజిక అంశాలను లోతుగా చర్చించేవని వివరించారు. ''తొలి నాళ్లలో ఆయన ఒక సహాయకునిగా ఉన్నప్పుడు సైతం సమాజానికి అద్దం పట్టే సినిమాలను తీసిన ప్రతిభాశాలి. 'బూట్ పాలిష్', 'జాగ్తే రహో', ఇంకా 'బావ్‌రే' వంటి చిత్రాలు విస్మరించిన, నిరాదరణకు గురి అయిన వర్గాల వారంటే ఆయనకున్న కరుణను కళ్లకు కట్టాయి" అని ఆవెు తెలిపారు. కథను చెప్పడంలో కపూర్ గారికున్న శక్తి సినిమా హాళ్ల కన్నా విస్తృతమైందన్నారు. "ఆయన కథనాల ప్రభావం అంతటిది" అని ఆమె చెబుతూ, "ఆయన చిత్రాల్లో చెడ్డ మనుషులు మనసు మార్చుకొని తమ జీవనాన్ని ఉద్ధరించుకున్న వైనాలను చూసి విచలితులై, దేశంలోని బందిపోటు దొంగలు 1970వ దశాబ్దంలో లొంగిపోవడం మొదలుపెట్టార"న్నారు. స్వయంగా తన జీవితంలో తటస్థించిన ఒక సంఘటనను వెల్లడిస్తూ "భారతీయ డాక్టరొకరు ఆఫ్రికాలో ఓ రోగికి శస్త్రచికిత్స చేశారు. ఆ డాక్టరు భారత్‌కు చెందిన వారని తెలుసుకొని, ఆ రోగి ముఖం చాటంత అయింది. ఏమిటీ! మీరు రాజ్ కపూర్ గారి మల్లేనే భారత్ వారా' అని ఉబ్బితబ్బిబ్బు అయ్యారు. ప్రపంచ ఊహాలోకంలో ఆయన అంతగా ముద్రవేసుకున్నార"న్నారు.

సభాధ్యక్షత వహించిన శ్రీ బి.పి. సింగ్ మాట్లాడుతూ... ప్రజాదరణకు పాత్రమైన చలనచిత్ర మాధ్యమం ద్వారా నైతిక నిష్ఠను సమాజంలోకి చొప్పించాలని తలచిన కపూర్ గారి అపురూప సామర్థ్యాన్ని వేనోళ్ల ప్రశంసించారు. కళను ఒక సాధనంగా ఎంచుకొని మనం అనుసరించాల్సిన నైతిక సూత్రాలను సూచించిన మార్గదర్శి ఆయన అని శ్రీ సింగ్ వ్యాఖ్యానించారు.

# 9న సీమ జిల్లాల్లో షర్మిల పర్యటన

తిరుపతి, జూన్ 3: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తమ పార్టీని రాబోయే స్థానిక ఎన్నికలకు సన్నద్ధం చేసే లక్ష్యంతో మొదలుపెట్టిన రాష్ట్ర పర్యటనను రాయలసీమ నుంచి ప్రారంభించనున్నారు. ఈనెల 9వ తేదీన చిత్తూరులో మొదలుపెట్టే ఆ పర్యటన అయిదు రోజులపాటు రాయలసీమ జిల్లాల్లో కొనసాగనున్నది. ఆసందర్భంగా రాయలసీమ పరిధిలోని జిల్లాల్లో 7చోట్ల జిల్లా పార్టీ కార్యవర్గ సమావేశాలు నిర్వహించనున్నారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన అనంతరం రాష్ట్రంలో 2014, 2019 వరుస ఎన్నికల్లో ఘోర పరాజయాలను చవిచూసిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకత్వాన్ని స్వీకరించిన వైఎస్ షర్మిల 2024 ఎన్నికల్లో కూడా పార్టీని ఓటమి నుంచి కాపాడలేక పోయారు. ఆ ఎన్నికల్లో కడప లోక్ సభ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన షర్మిల మూడో స్థానానికి పరిమితం కావాల్సివచ్చింది. అన్నింటి కన్నా ముఖ్యంగా దశాబ్దాల తరబడి రాష్ట్రాన్ని ఏలిన కాంగ్రెస్ పార్టీ గత పదేళ్ల మధ్య కాలంలో జరిగిన స్థానిక ఎన్నికల్లో నామమాత్రపు పోటీకి పరిమితం కావడం ఆ పార్టీ దుస్థితికి అద్దం పడుతుంది. మరోవైపు పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలని దీక్షబూనిన షర్మిల 2024 ఎన్నికల అనంతరం గత ఏడాది మధ్యకాలంలో మీడియా ప్రకటనలకు, ఎంపిక చేసుకున్న సమస్యలపై పోరాడేందుకు పరిమితమయ్యారు.

వచ్చే ఏడాది రాష్ట్రంలో జరిగే స్థానిక ఎన్నికలకు పార్టీని సంసిద్ధం చేసే లక్ష్యంతో జిల్లా ల స్థాయి సమావేశాలు నిర్వహిం చ డానికి పర్యటించాలని నిర్ణయించారు.

ఆమేరకు ఈనెల 9వ తేదీన షర్మిల రాష్ట్ర స్థాయి పర్యటనను రాయలసీమ జిల్లాల నుంచి మొదలు పెట్టనున్నారు. ఖరారైన కార్యక్రమం ప్రకారం ఈనెల 9వ తేదీ సాయంత్రం చిత్తూరులో నిర్వహించే పార్టీ జిల్లా సమావేశంతో షర్మిల పర్యటన మొదలు కానున్నది. 10వ తేదీ ఉదయం అన్నమయ్య జిల్లా రాజంపేట, రాయచోటి, సాయంత్రం సత్యసాయి జిల్లా హిందూపురంలో సమావేశాలు నిర్వహిస్తారు.

11 వతేదీ ఉదయం అనంతపురం జిల్లా కేంద్రంలో, సాయంత్రం కర్నూలు జిల్లా కేంద్రంలో సమావేశాలు నిర్వహిస్తారు. 12వ తేదీ ఉదయం నంద్యాల జిల్లా కేంద్రంలో, సాయంత్రం వైఎస్సార్ కడప జిల్లా కేంద్రంలో సమావేశాలు నిర్వహిస్తారు. 13వ తేదీ ఉదయం నెల్లూరు జిల్లా కేంద్రంలో సమావేశం నిర్వహించి అదేరోజు సాయంత్రం తిరుపతి జిల్లాకు వచ్చి తిరుపతిలో కానీ శ్రీకాళహస్తిలో కానీ నిర్వహించే జిల్లా పార్టీ సమావేశాల్లో పాల్గొంటారు. తరువాత 18వ తేదీన విశాఖ పట్నం జిల్లా నుంచి 20వ తేదీన అనకాపల్లి జిల్లా వరకు పర్యటించి ఉత్తరాంధ్ర జిల్లాల సమావేశాల్లో, 25వ తేదీన గుంటూరు జిల్లా నుంచి 30వ తేదీన ఎన్టీఆర్ కృష్ణ జిల్లా వరకు మిగిలిన జిల్లాల సమావేశాల్లో పాల్గొంటారు.

# మూడు లక్షల మంది కేడెట్లతో ఎన్‌సీసీ విస్తరణ...శ్రీ సంజయ్ సేఠ్ ప్రకటన

న్యూఢిల్లీ, జూన్ 3:నేషనల్ కేడెట్ కోర్ (ఎన్‌సీసీ) ప్రత్యేక సంయుక్త రాష్ట్రాల ప్రతినిధులు, అడిషనల్ లేదా డెప్యూటీ డైరెక్టర్స్ జనరల్ (జేఎస్ఆర్–ఏ/డీ) సమావేశాన్ని కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి శ్రీ సంజయ్ సేఠ్ భోపాల్‌లో ఈ రోజు ప్రారంభించారు. ఎన్‌సీసీని ఒక పథకం ప్రకారం విస్తరించడానికి దేశమంతటా మూడు లక్షల మంది కేడెట్లను చేర్చుకోనున్నట్లు ఆయన ఈ సందర్భంగా ప్రకటించారు. దీనికోసం అనేక రాష్ట్రాలు ఇప్పటికే వాటి అంగీకారాన్ని తెలియజేశాయని, శిక్షణనివ్వడానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో వేగవంతమైన వృద్ధికి కట్టుబడి ఉన్నామని మంత్రి అన్నారు.

ఈ సందర్భంగా సభను ఉద్దేశించి శ్రీ సంజయ్ సేఠ్ ప్రసంగిస్తూ, దేశ నిర్మాణంలోనూ, యువతను తీర్చిదిద్దడం లోనూ ఎన్‌సీసీ భూమికను పునరుద్ఘాటించారు. ఈ విషయంలో ఇటీవల చేపట్టిన కార్యక్రమాలను ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. వాటిలో పూర్వ సైనికులను ఎన్‌సీసీ బోధకులుగా చేర్చుకోవడం, వారికి ఉపాధి తాలూకు నూతన అవకాశాలను కల్పించడం వంటివి భాగంగా ఉన్నాయి. స్వచ్ఛ్ భారత్ ఉద్యమం, నయా సవేరా పథకం, నషా ముక్తి ఉద్యమం వంటి జాతీయ కార్యక్రమాల్లో ఎన్‌సీసీ క్రియాశీల భాగస్వామ్యాన్ని ఆయన ప్రశంసించారు. మౌంట్ ఎవరెస్టును ఈ నెల 18న ఎన్‌సీసీ దళ సభ్యులు విజయవంతంగా అధిరోహించినందుకు రక్షణ శాఖ సహాయ మంత్రి అభినందనలు తెలిపారు. ధైర్య–సాహసాలతో పాటు కేడెట్ల సామర్థ్యానికి ఇది ఒక శక్తిమంతమైన ఉదాహరణ అని ఆయన అన్నారు.

కేంద్ర–రాష్ట్రాల సహకారం కొనసాగాలని శ్రీ సంజయ్ సేఠ్ పిలుపునిచ్చారు. ఎన్‌సీసీ విస్తరణకు తోడ్పడడానికి అవసరమైన సిబ్బంది, మౌలిక సదుపాయాలు, ఆర్థిక సహాయం వంటి తమ వాగ్దానాలను రాష్ట్రాలు నెరవేర్చాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దీనివల్ల యువత భవితకు రూపురేఖలను ఇవ్వడంలోనూ, దేశాన్ని సురక్షితంగా ఉంచడంలోనూ ఈ సంస్థ పోషిస్తున్న ముఖ్య పాత్రకు బలం సమకూరుతుందన్నారు.

కోర్ విజయాలను, ముందున్న మార్గాన్ని ఎన్‌సీసీ డైరెక్టర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ గుర్‌బీర్‌పాల్ సింగ్ వివరించారు. దీనిలో దేశవ్యాప్తంగా పటిష్టమైన శిక్షణ–శిబిరాలకు సంబంధించిన మౌలిక సదుపాయాల కల్పనపై శ్రద్ధ తీసుకున్నారు. సంస్థలో యువత మరింత ఎక్కువ స్థాయిలో పాలుపంచుకోవడాన్ని ప్రోత్సహించడంతో పాటు కేడెట్ల పనితీరును మెరుగుపరచాలని కూడా లక్ష్యంగా పెట్టుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో విద్యాశాఖ, యువజన వ్యవహారాలు–క్రీడల శాఖ మంత్రులు, రక్షణ శాఖ ఉన్నతాధికారులు, రాష్ట్రాల విభాగాల ప్రతినిధులు, అన్ని రాష్ట్రాల ఎన్‌సీసీ ప్రతినిధులు కూడా పాల్గొన్నారు.

# డబుల్ బెడ్రూంలో కుట్రలు.. మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లిన మల్లారెడ్డి



హైదరాబాద్, జూన్ 3:అర్హులైన వారికి కాకుండా తమ కార్యకర్తలకు డబుల్ బెడ్రూం ఇండ్లు కేటాయించేలా అధికారులపై కాంగ్రెస్ నాయకులు ఒత్తిడి తీసుకొస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతాప సింగారంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లను కాంగ్రెస్ కార్యకర్తలకు కేటాయించేలా చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవాలని మాజీ మంత్రి మల్లారెడ్డిని విజ్ఞప్తిచేశారు. గతంలో డబుల్ బెడ్రూం కేటాయించేలా తమ పేర్లతో జాబితా సిద్ధం కాగా, ఇప్పుడు కాంగ్రెస్ నాయకులు తమ వారితో కొత్త జాబితాను సిద్ధం చేశారని తెలిపారు. కాగా, వారికి అండగా నిలబడిన మాజీ మంత్రి మల్లారెడ్డి.. అర్హులైన వారికి డబుల్ బెడ్రూం ఇండ్లు అందేవరకు పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు. అర్హులకు డబుల్ బెడ్రూం ఇండ్లు కేటాయించకుంటే బాధితులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

బాధితుల విజ్ఞప్తి మేరకు మేడ్చల్ జిల్లాలో జరుగుతున్న కుట్రను ఇంచార్జి మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి మాజీ మంత్రి మల్లారెడ్డి తీసుకెళ్లారు. అర్హులైన వారికి కాకుండా ఇతరులకు కేటాయించి సొమ్ము చేసుకునేందుకు జిల్లాలోని కాంగ్రెస్ నాయకులు ప్రయత్నిస్తున్నారని మంత్రికి వివరించారు. అర్హులకే డబుల్ బెడ్రూం ఇండ్లు కేటాయించే విధంగా చూడాలని కోరారు.

# అంబేద్కర్ వర్సిటీలో ఎంబీఏ హాస్పిటల్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ కోర్సులు




హైదరాబాద్, జూన్ 3:బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ క్యాంపస్‌లో ఎంబీఏ హాస్పిటల్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ (హెచ్‌హెచ్‌సీఎమ్) కోర్సును అందించడానికి నగరానికి చెందిన మూడు విద్యాసంస్థలతో అంబేద్కర్ వర్సిటీ అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. మంగళవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డా. బీఆర్అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొ. ఘంటా చక్రపాణి సమక్షంలో అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్, కిమ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ, దారుస్సలాం ఎడ్యుకేషన్ ట్రస్ట్ విద్యాసంస్థలతో ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు.

ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్ ప్రొ. ఘంటా చక్రపాణి మాట్లాడుతూ.. కార్పొరేట్ వైద్యరంగంలో అనేక మార్పులు వస్తున్న తరుణంలో బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సులో భాగంగా హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ కోర్సును అందించడంతో మంచి ఉపాధి అవకాశాలు ఉంటాయని అన్నారు. ఈ కోర్సులను అందించేందుకు గతంలో ఉన్న ఒప్పందాన్ని ప్రస్తుతం పునరుద్ధరిస్తున్నామని తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు: ఎమ్మెల్యే పద్మారావు గౌడ్




హైదరాబాద్, జూన్ 3: ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే తీవ్ర చర్యలు తప్పవని సికింద్రాబాద్ ఎమ్మెల్యే టి.పద్మారావు గౌడ్ అన్నారు. సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధి కార్యకలాపాల సమీక్షా సమావేశం మంగళవారం సీతాఫల్ మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగింది. వర్షా కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బక్రీద్ పర్వ దిన ఏర్పాట్లు, స్కూళ్ల రీఓపెన్ నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, టాక్స్, హౌసింగ్ సమస్యలు, ఇతరత్రా అంశాలపై ఈ సమావేశంలో సమగ్రంగా చర్చించారు.

ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ.. వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల కొరత ఎదురుకావడం శోచనీయమని తెలిపారు. నిధుల కేటాయింపుతో నిమిత్తం లేని అన్ని సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నాలా పూడిక తీసివేతను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని మునిసిపల్ డివిజన్లలో అత్యవసర బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అపాయకరంగా నిలిచిన విద్యుత్ తీగలను వెంటనే తొలగించాలని, వివిధ ప్రదేశాల్లో చెట్ల కొమ్మల వల్ల ఇబ్బందులు తలెత్తకుండా వాటిని తొలగించాలన్నారు. అడ్డగుట్ట, లాలాపేట, ఎరుకల బస్తీ ఫంక్షన్ హాల్స్ నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని, స్విమింగ్ పూల్ నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

లాలాపేటలో రోడ్డు విస్తరణను పూర్తి చేసినప్పటికీ స్తంభాల తొలగింపు, ఇతరత్రా పనులు చేపట్టని కారణంగా విస్తరించిన ప్రయోజనం నెరవేరడం లేదని పద్మారావు గౌడ్ తెలిపారు. చంద్రబాబు నగర్, పాండవ బస్తీ, శాస్త్రి నగర్, లంబాడి బస్తీ, మంగర్ బస్తీ ప్రాంతాల్లో ప్రభుత్వ ఇళ్ళు శిధిలావస్థకు చేరిన పరిస్థితి ఉన్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని అన్నారు. సుబాష్ చంద్రబోస్ నగర్, దోభీ ఘాట్ లలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ కేటాయింపు వెంటనే పూర్తి చేయాలని, సాయి నగర్ లో నిర్మాణం పనులు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. రాజీవ్ యువ వికాసం అర్హులైన దరఖాస్తులు పరిష్కరించాలన్నారు. మేడి బావి నివాసులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. కొత్త వార్డు కార్యాలయం నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని, ఇందిరానగర్ కమ్యూనిటీ హాల్ పునర్నిర్మాణం, లాలాగూడ లోని అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌కు విద్యుత్ సరఫరాకు ఏర్పాట్లు వెంటనే చేపట్టాలని సూచించారు.

ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు అంశంలో త్వరితగతిన ఏర్పాట్లు జరపాలని, శాస్త్రి నగర్ లో రుద్ర వీణ సంస్థ అభ్యర్థనకు అనుగుణంగా కమ్యూనిటీ హాల్, సేవ లాల్ మహారాజ్ భవనం నిర్మాణానికి ఏర్పాట్లు జరపాలని కోరారు. వివిధ ప్రభుత్వ కార్యాలయాల అధికారులు ప్రజలకు అందుబాటులో నిలవాలని పద్మారావు గౌడ్ సూచించారు. వివిధ విభాగాల మధ్య తమ కార్యాలయం ద్వారా నిర్వహించే సమన్వయ వాట్సాప్ గ్రూప్ సందేశాలకు వెంటనే స్పందించాలని అధికారులను ఆదేశించారు.

డిప్యూటీ కమిషనర్ సుభాష్ రావు.. మాట్లాడుతూ.. సికింద్రాబాద్ పరిధిలో అభివృద్ధి కార్యకలాపాలు వేగంగా జరుగుతున్నాయని, అన్ని విభాగాల మధ్య సమన్వయం ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. జీహెచ్ఎంసీ ఎస్ఈ ఆశాలత మాట్లాడుతూ.. వర్షా కాలంలో ఎటువంటి సమస్యలు ఎదురు కాకుండా జాగ్రత్తలు పాటిస్తున్నామన్నారు. నిధుల కేటాయింపునకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

# నా ఆస్తి కబ్జా చేశాడు.. ఎన్నారై నేత మురళీమోహన్ ఆవేదన

హైదరాబాద్, జూన్ 3:ఏపీ టీడీపీ మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు, అతని అనుచరులు తన ఆస్తిని కబ్జా చేశారని ఎన్ఆర్ఐ టీడీపీ సెల్ సభ్యుడు రావి మురళీ మోహన్ ఆరోపించారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఏపీలోని చిలకలూరిపేటలో తనకు సాయికార్తీక్ సిటీ సెంటర్ పేరుతో షాపింగ్ కాంప్లెక్స్ ఉందని తెలిపారు. సదరు కాంప్లెక్స్‌లో రెండు థియేటర్లు, ఫంక్షన్ హాళ్లు, రెండు అంతస్తుల వాణిజ్య సముదాయాలు ఉన్నాయని పేర్కొన్నారు. వాటి విలువ సుమారు రూ. 69 కోట్లు ఉంటుందని చెప్పారు.

ఉద్యోగరీత్యా తాను 20 సంవత్సరాలుగా అమెరికాలోని ఫ్లోరిడాలో నివాసం ఉంటున్నానని మురళీమోహన్ తెలిపారు. గత పది నెలల క్రితం ఏపీకి చెందిన మాజీ మంత్రి టీడీపీ నేత పత్తిపాటి పుల్లారావు, అతని అనుచరులు తన షాపింగ్ కాంప్లెక్స్ మొత్తాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నాని తెలిపారు. తన తండ్రి కందిమల్ల అంజిబాబు అనే వ్యక్తి వద్ద రూ. 97లక్షల రుణం తీసుకున్నాడని ఆరోపిస్తూ తన ఆస్తులను కబ్జాదారులు ఆక్రమించుకున్నారని పేర్కొన్నారు. నిజంగానే రుణం తీసుకుంటే తాను మొత్తం చెల్లిస్తానని చెప్పారు. రుణం పేరుతో తన ఆస్తిని కబ్జా చేస్తున్నారని, వారికి మాజీ మంత్రి పత్తిపుల్లారావు సహకారం ఉందన్నారు. ఈ విషయంపై అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేస్తే కేసు పెట్టడం లేదని, ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. తన ఆస్తులను కబ్జా చేసిన వ్యక్తులందరూ టీడీపీ పార్టీయే కావడంతో సరైన చర్యలు తీసుకోవడం లేదని వాపోయారు. తనకు టీడీపీతో 37 సంవత్సరాల అనుబంధం లేదని, ఆ పార్టీ ఎన్ఆర్ఐ సెల్‌కు తాను సభ్యుడిగా ఉన్నానని తెలిపారు. ప్రభుత్వం స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు.

# బీఈ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

హైదరాబాద్, జూన్ 3: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఈ కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఈ (ఏఐసీటీఈ) రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్ లాగ్, బీఈ (సీబీసీఎస్), బీఈ (నాన్ సీబీసీఎస్) బ్యాక్‌లాగ్ పరీక్షా ఫీజును ఈ నెల 13వ తేదీలోగా సంబంధిత కళాశాలలో చెల్లించాలని చెప్పారు. రూ. 200 అపరాధ రుసుముతో 17వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ లిలిలి.నీబఎజీనితిజీ.జీఇ.తిని లో చూసుకోవాలని సూచించారు.

## బీఈ కోర్సుల వన్‌టైమ్ ఛాన్స్ పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని విభాగాల బీఈ కోర్సులు పూర్తి చేసి బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు మిగిలిపోయిన వారికి వన్ టైమ్ చాన్స్ కల్పించినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఓయూ అకాడమిక్ సెనేట్ స్టాండింగ్ కమిటీ అనుమతించిందని చెప్పారు. 2000 సంవత్సరం తరువాత ఆయా కోర్సుల్లో చేరినవారు సైతం తమ బ్యాక్ లాగ్ పరీక్షలకు హాజరయ్యేందుకు అవకాశమిచ్చామని తెలిపారు. ఈ కోర్సుల అన్ని సెమిస్టర్ల పరీక్షా ఫీజును ఈ నెల 13వ తేదీలోగా చెల్లించాలని సూచించారు. రూ. 200 అపరాధ రుసుముతో కలిపి 17వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించవచ్చని తెలిపారు.

అన్ని కోర్సుల పరీక్షలకు సాధారణ పరీక్షా ఫీజుతో పాటు పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న సిలబస్, పరీక్షా విధానంలోనే వారు పరీక్షలకు హాజరుకావాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

# తాగునీటి సమస్య పూర్తిగా పరిష్కరిస్తా.. ఎమ్మెల్యే వివేక్



హైదరాబాద్, జూన్ 3: మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజకవర్గ కేంద్రంలో ప్రజలకు పూర్తిస్థాయి తాగునీటి సౌకర్యాన్ని కల్పిస్తానని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. ఈరోజు ఉదయం పట్టణంలోని 6వ, 12వ వార్డుల్లో నూతనంగా ఏర్పాటు చేసిన బోరు పంపులను స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పట్టణంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించి ప్రతి ఇంటికి నీరందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# మానకొండూర్‌లో ఇసుక లారీల అడ్డుకున్న బీఆర్ఎస్ శ్రేణులు



కరీంనగర్, జూన్ 3:ఇసుక లారీలు, ట్రాక్టర్ల తో ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారని అక్రమ ఇసుక రవాణా ను అధికారులు అరికట్టాలని బీఆర్ఎస్ శ్రేణులు ఆరోపించారు. మండల కేంద్రంలోని పల్లెమీద చౌరస్తా వద్ద కరీంనగర్ వరంగల్ రహదారిపై నాయకులు మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ తాల్లపెల్లి శేఖర్ గౌడ్ మాట్లాడుతూ ఊటూరు ఇసుక క్వారీ నుంచి ఇసుకను తరలిస్తున్న లారీలడ్రైవర్లు మితిమీరిన వేగంతో లారీలను నడపడం తో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.

క్వారీ నిర్వాహకులు క్వారీ ప్రాంతంలో పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేయకపోవడంతో లారీల డ్రైవర్లు లారీలను ఇష్టం వచ్చినట్లు రహదారుల పక్కనే పార్కింగ్ చేస్తున్నారని దీంతో వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. మండలంలోని శ్రీనివాస్ నగర్, జగ్గయ్యపల్లి, లింగాపూర్, వెల్ది, వేగురుపల్లి తదితర ప్రాంతాల నుంచి ప్రతిరోజు ట్రాక్టర్ల ద్వారా అక్రమ ఇసుకను తరలిస్తున్నారని దీనికి తోడు ఊటూరు క్వారీ నుంచి వందల సంఖ్యలో ఇసుక లారీలు, టిప్పర్లు వెల్లుతున్నయన్నారు. ఇసుక వాహనాల ద్వారా వచ్చే దుమ్ము, ధూళితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి అన్నారు. ఇసుక లారీలు, ట్రాక్టర్ల తో మానకొండూర్ ప్రజలు తీవ్ర ఇబ్బందుల పడుతున్నారన్నారు. రహదారి పక్కనే ఉన్న గృహయజమానులు ఇసుక లారీలు, టిప్పర్లు, నుండి వచ్చే దుమ్ము ధూళితో అనారోగ్యాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు మామూళ్ల మత్తును వీడి అక్రమ ఇసుక రవాణా పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మానకొండూర్ నుంచి ఇసుక తరలిస్తున్న లారీలను నిలిపివేయాలని కోరారు.

ఆందోళన వద్దకు పోలీసులు చేరుకుని సమస్య పరిష్కరించదానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో నాయకులు గుర్రం కిరణ్ గౌడ్, పిట్టల మధు, కొత్తకొండ నాగరాజు, గడ్డం సంపత్, బుర్ర సత్యనారాయణ, బోడ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణను సాధించిన నాయకుడు కేసీఆర్ : ఎమ్మెల్యే కూనంనేని




ఖమ్మం, జూన్ 3:ఎవరు అవునన్నా కాదన్నా తెలంగాణ సాధనలో కేసీఆర్ పాత్ర మరువలేనిదని కొత్తగూడెం శాసనసభ్యుడు, సీపీఐ పార్టీ రాష్ట్ర సెక్రెటరీ కూనంనేని సాంబశివరావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ ఎత్తుగడలు, ఆయనకున్న వాక్ చాతుర్యంతో హింసాయుత సంఘటనలకు తావు లేకుండా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని చెప్పడంలో అతిశయోక్తి లేదన్నారు.

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని రుద్రంపూర్ ప్రగతి మైదానంలో సింగరేణి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర సాధన సమయంలో కేసీఆర్ కు వెన్నుండి నడిపించిన ప్రొఫెసర్ జయశంకర్ సార్, ప్రొఫెసర్ కోదండరాం, విద్యాసాగర్, మేధావులు, కవులు, కళాకారులు, కార్మిక లోకం, కర్షక లోకం, విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, వయోభేదం, లింగ బేధం లేకుండా కలిసి కొట్లాడం వల్లే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందన్నారు.

తెలంగాణ ఉద్యమంలో సింగరేణి కార్మికుల పాత్ర మరువలేనిదన్నారు. నాడు సకల జనుల సమ్మెలో 42 రోజుల పాటు పాల్గొని తెలంగాణపై వారికున్న మక్కువను చూపెట్టుకున్నట్లు తెలిపారు. తాను శాసనసభ్యుడిగా గెలిచానంటే అంటే అది సింగరేణి కార్మికుల దయే అన్నారు. సింగరేణి కార్మికుల హక్కుల కోసం కామ్రేడ్ శేషగిరిరావు, కొమురయ్య, విఠల్ రావు చూపెట్టిన మార్గంలోనే తాను పోరాడుతానని తెలిపారు.

తెలంగాణకు ఆర్థికపరమైన సంక్షోభం ఎప్పుడూ కూడా లేదన్నారు. మనది ధనిక రాష్ట్రం, కానీ డబ్బులు చేతుల్లో లేవు, ఆస్తులు రూపంలో ఉన్నట్లు చెప్పారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వాగ్దానాలు అమలు చేయలేకపోతుంది. వారి సహాయంతో తాము గెలిచాం, మా సహాయంతో వారు గెలిచారు. స్నేహం స్నేహమే. స్నేహంగా ఉన్నామని నోరు మూసుకుని ఉండం. ప్రశ్నిస్తాం.. ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. అనంతరం ఉత్తమ కార్మికుడిగా ఎన్నికైన ఆర్ సి హెచ్ పి కి చెందిన జక్కుల గట్టయ్యను సింగరేణి యాజమాన్యంతో కలిసి ఎమ్మెల్యే సన్మానించారు.

ఈ కార్యక్రమంలో ఏరియా జనరల్ మేనేజర్ శాలెం రాజు, ఎస్ ఓ టు జి ఎం జీ. వి కోటిరెడ్డి, ఇంజినీర్ కె.సూర్యనారాయణ రాజు, ఏజీఎం సివిల్ సిహెచ్ రామకృష్ణ, ఆర్ సి హెచ్ పి ఎస్ ఈ.కరిముల్లా, క్వాలిటీ మేనేజర్ మదన్‌మోహన్, ఐ ఈ డి డి వై జీఎం యోహాన్, డివైపిఎం శివకేశవరావు, మురళి, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ వట్టికొండ మల్లికార్జున్ రావు, ఐఎన్‌టీయూసీ ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్, సిపిఐ సాబీర్ పాషా, మాజీ ఎంపీపీ సలిగంటి శ్రీనివాస్, ఏఐటీయూసీ నాయకులు జక్కుల గట్టయ్య, సముద్రాల సుధాకర్, హుమాయిన్, కత్తెర్ల రాములు, మధు కృష్ణ, ఐఎన్‌టీయూసీ నాయకులు చావసాగర్, శ్రీనివాస్ రెడ్డి, మోహన్ రెడ్డి, సింగరేణి అధికారులు, కార్మికులు, డీఎల్ఆర్ కార్మికులు, ప్రభావిత ప్రాంత ప్రజలు పాల్గొన్నారు.

